మినీకథ :

# స్టీల్ సంతల సయ్యాటలు

'బెగ్ బారో ఆర్ స్టీల్" అనేది పుస్తకాలను గూర్చి చెప్పిన ఒక క్వొటేషను. కాని చివర్ది వుంది చూశారూ! అది ప్రస్తుతం ఆడవాళ్ళ యిష్టా రాజ్యంగా ఉన్న అంశం. ఆఫీసుకు వెళ్ళిన ఆయనగారి బట్టల్ని స్టీలుగిన్నెల వాడి భోజనానికి స్టీల్ చేసి వాడిచ్చే బొచ్చెలతో సంతలు యేర్పరచుకోని ఆడది స్టీలు కాగడా వేసి గాలించినా నాక్కానబళ్ళేదు. కొంపలో జాగావున్నా, లేకపోయినా, అవసరమున్నా, లేకపోయినా, స్టీలు సామగ్రిని పోగేసుకుని అందరమ్మల ముందు'పోజు' చూపటం అనేది నేటి పడతుల్లో చాలమందికి ఫాషన్. స్టీలు సామగ్రి వాడకం ఆరోగ్యానికి మంచిదికాదు అని డాక్టర్లు మొత్తుకొంటున్నాగానీ, పోదురూ! నేను వాడకానికి కొంటున్నానా! 'షో' కోసం కానీ! అని బాహాటంగా చెప్పుకొనే వారు మన భామల్లో కోకొల్లలు. కనుక బయటకు వెళ్ళే మగాయనల్లారా! తస్మాత్ జాగ్రత్త! మీ బట్టలన్నీ యీ స్టీలు సంతల బారిని పడకుండా రుమాలుతోసహా జాగ్రత్తగా తాళాలు (వీలుంటే స్టీలువి) వేసుకుపొండి. ఆ స్టీలు తాళాల తళుకులైనా మీ తరుణుల్ని వాటిని పగలగొట్టకుండా చేయగలవని ఆశిద్దాం. లేదా వీలుంటే మీ బాస్‌ను మంచిచేసుకొని (ఆయన మగాడయితే సహానుభూతి వుండొచ్చు) మీ గుడ్డలు ఆఫీసులోనే తగలేసుకోండి. లేకపోతే మీరు సాయంత్రం యింటికి వచ్చేసరికి డ్రాయరు, బనీనే మీకు దక్కుతయి. చీకూ, చింతా లేకుండా మీ బెటర్ హాఫ్‌గారు మీ ముందుకు వచ్చి, చూచారా! మీ బట్టలన్నీ వాడి యెదాన పడేసి యీ పేద్ద స్టీలు చెంబా తీసుకున్నాను. అని విజయగర్వంతో చెప్పగలదు. మీకు వళ్ళు మండి, "నన్నుగూడ యిచ్చెయ్యలేకపోయావా! ఒక చిన్నపాటి గ్లాసయినా యిచ్చేవాడు" అన్నారో! దెబ్బతిన్నారే! ఆమె కన్నీరు ప్రవహించి అంతకుముందే కొన్న స్టీలు గిన్నెల్ని నింపుతుంది. అవి అంతకుమించి వుపయోగించవులెండి మరి.

ఇటీవలి కాలాలలో ఈ "స్టీలువతుల పిచ్చి" యెంతగా ముదిరిపోయిందంటే వంటి నున్న బంగారాన్ని వలిచి యిచ్చియైనా ఈ తళతళలాడే తక్కువ వుక్కుముక్కలు ముమ్మందు పొందుతారేమోనని భయమేస్తుంది. వీరి బలహీనతల్ని అడ్డం పెట్టుకొని స్టీలుస్టాళ్ళ వాళ్ళు బాగుపడుతున్నారు. వాయిదాల స్కీములనీ, అవనీ, యివనీ యేవో చెప్పి డబ్బు దండుకొని 'పరారీ' అవుతున్నా ఈ తేలుకుట్టిన దొంగలకు తెలివిరావటంలేదు. రెండోరకం, మూడోరకం పాత్రలు యిచ్చి మర్నాటికే నల్లబడే వాటిని తోమలేక స్త్రీల మొహాలు తెల్లబడుతున్నాయి. విమ్, చింతపండు వంటి తోముడు సామగ్రి ధరలు చుక్కల్ని నిక్కుతున్నా మన భామలు బిక్కమొహాలేసుకు చూస్తున్నారు తప్ప స్టీలు వలలోంచి బయటపడటంలేదు. భర్త విరహమైనా భరిస్తారుగాని స్టీలుసామగ్రి వాటి విరహం వీరు భరించలేరు. (పాపం శమించుగాక! యిక్కడ వాడి అంటే వాడియైన అని నా భావం). స్టీలువాడు స్టయిల్‌గా అందరమ్మల-ఘనస్వాగతాన్నందుకుంటూ బట్టలు, యిత్యాది సామగ్రి వాళ్ళ కళ్ళముందే దోచేసి ఒక చెంబానో, ఒక బుడ్డిబెంబో యిచ్చేటప్పటికి సమస్త సామ్రాజ్యాన్ని జయించుకొన్నట్లుగా యింటావిడ కళ్ళు మిలమిలా మెరుస్తాయి. దసరా, సంక్రాంతి పండుగలకు బొమ్మల కొలువునైనా మానుతున్నారుగాని యింటింటా యీ స్టీలు కొలువులు మానటంలేదు మన 'స్టీలవ్వ'లు. పైగా విలువైన యిత్తడి కంచు పాత్రల మారకంతో స్టీలు సామగ్రి చేర్చుకోవటం అవివేకం అని మనం అంటే మిగిలేవి శాపనార్థాలే.

సంసారం అన్న తరవాత గిన్నెలు అవసరమే కాని 'అతి'ని ప్రేమించే యీ స్టీలవ్వలు తగ్గకపోతే సమాజం 'స్టేల్' అవుతోందని నా భయం. ఇంటింట స్టీలు సంతలు వున్నకారణంగానే మనకు రావల్సిన స్టీలు ఫ్యాక్టరీ వెనకబడిపోతోందని ఒక వర్గంవారి బలమైన భావం.

మిగిలిన విషయాల్లో స్వాతంత్ర్యం, సమభావం వున్నా, లేకపోయినా స్త్రీలు సంతల సేకరణలో మాత్రం అది అంది పుచ్చేసుకొని కొంపలో కాలు పెట్టటానికిగూడా జాగాలేకుండా చేస్తున్నారు కొందరు వనితలు. స్త్రీలు పిచ్చిని కార్టూనిస్టులు హెచ్చరిస్తూ వెలికి తెస్తున్నారు. ఇటీవల ఒక కార్టూన్‌లో అర్ధనగ్నంగా నిలబడ్డ స్త్రీని స్టీలువాడు ఆ మిగిలినవికూడా యిస్తే మరో గిన్నె యిస్తాను అని గడుసుగా అనటం నేడు అతిశయోక్తి కావచ్చునేమో కాని నేటి స్టీలిజం రేపు నిజం చేస్తుందేమో! మరో కార్టూనులో వున్నట్లు స్టీలు గిన్నెల మైకంలో మునిగిన మగువ చీరను స్టీలుగిన్నెలవాడు నాణ్యం పేరుతో అపర దుశ్శాసనుళ్ళా పట్టుకు లాగుతున్నా పట్టించుకోని దుస్థితి రాకూడదు.

స్టీలపతుల వల్ల వస్త్రహీనులైన అభాగ్యులంతా తమ మాన సంరక్షణ [illegible]మని స్టీలు గిన్నెలవాళ్ళను బ్రతిమలాడితే[illegible]గాని వాళ్ళు చెంచా ఒకటికి 100 రూ॥ అయినా చెప్పి వీరి మానం, మనశ్శాంతి కాపాడరేమో? భవిష్యత్తులో పెండ్లి చేసుకోబోయే మొగాళ్ళనైనా స్టీలు పిచ్చిదాన్ని కాని దాన్ని చేసుకొని సుఖపడమని కోరటం సమంజసమనిపిస్తుంది. కొంప వెంబడి తిరిగి బట్టలు పుచ్చుకొని పొయ్యేవాళ్ళని బేన్‌చేసి ప్రభుత్వం పదుగురి మానరక్షణం చేయాలి. అంతవరకు స్టీలు సంతల సయ్యాటలకు గుడ్‌బై లేదు. స్టీలపతుల ఆటకట్టుకాదు. ఏమంటారు?

"సుచంద్ర"

# ఓవర్ స్పీడ్

శంకరమఠం దగ్గర బస్‌కోసం ఎదుర్చూసి విసిగి ఆటోని కేకేశేం. వెంకటేశ్వర థియేటర్‌కి వెళ్ళాలని మా ప్రయత్నం. ఆటో వచ్చేక ఎక్కేం నేనూ,మా మిత్రుడు ఆంజనేయులూ.

ఆటో కదిలింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌మీంచి తీసుకువెళ్ళమని చెప్పేం. డ్రైవర్ అలాగేనని తలూపి స్టార్ట్ చేసేడు.

ఆటో కదిలి ఓ వంద గజాలు వెళ్ళింది. ఈలోగా వెనకనించి ఓ ఆటో రివ్వున మమ్మల్ని ఓవర్‌టేక్ జేసుకుంటూ వెళ్ళింది. అదిజూసి మా ఆటో డ్రైవర్‌కి వళ్ళు మండినట్లుంది. దానివెనక పడ్డాడు అదే స్పీడ్‌తో. రెండు ఆటోలు ఒకదాని వెనక ఇంకొకటి చాలా స్పీడ్‌గా వెళ్ళసాగేయి.

ఆ స్పీడ్‌కి మా యిద్దరికీ భయంవేసింది. మా ఆంజనేయులు బయటపడి "స్పీడ్ తగ్గించవయ్యా కొంపేం మునగదు!" అన్నాడు డ్రైవర్‌తో. ఆ డ్రైవర్ వెనక్కి తిరిగి చూడలేదు. ఆ స్పీడ్ అలాగే కంటిన్యూ చేసేడు. ఆ ఆటోని ఓవర్‌టేక్ చేయాలని రెండుసార్లు ప్రయత్నం చేసేడు కానీ ముందున్న ఆటో డ్రైవర్ పడనివ్వలేదు.

అప్పటికే రెండు ప్రమాదాలు వెంట్రుకవాసిలో తప్పిపోయాయి. చిక్కడపల్లి రోడ్ ఆ సమయంలో రష్‌గా వుంటుంది. అయినా వాళ్ళిద్దరు స్పీడ్‌లు తగ్గించలేదు. పోలీసులెవరూ ఆటోలని పట్టించుకోరు.

ఆంజనేయులు బెదిరిపోయేడు. ఆంజనేయ దండకం మొదలుపెట్టేడు. ఓ లారీ, యింకో సిటీబస్ మమ్మల్ని క్షణాల వ్యవధిలో చావు నుంచి తప్పించేయి.

యీలోగా మేం దిగాల్సిన స్టాప్ వచ్చేసింది.

మా ముందు వెళ్ళిన ఆటో అలాగే వెళ్ళిపోయింది అదే స్పీడుతో. మా డ్రైవర్ ఏదో ఉర్దూలో తిట్టుకుంటూ ఆటో ఆపేడు థియేటర్ ముందు.

ఆంజనేయులు ఆటో ఆగీ ఆగకముందే దిగి అంత స్పీడ్‌గా తీసుకువచ్చినందుకు తిడుతూ తగవుపెట్టుకున్నాడు ఆటో డ్రైవర్‌తో. నేను మీటర్‌కి సరిపడ చిల్లర వెతికే ప్రయత్నంలో పడ్డాను.

ఆటో డ్రైవర్ కాస్సేపు ఆంజనేయుల్ని అరవనిచ్చి, నాదగ్గర చిల్లర తీసుకొని చెప్పేడు తాపీగా! "ముందువెళ్తున్న డ్రైవర్ నా కొడుకు సార్! అంత ఓవర్‌స్పీడ్‌గా వెళ్ళద్దని లక్షసార్లు చెప్పేను. వాణ్ణి ఆపి తిడదామని ఓవర్‌టేక్ చెయ్యబోయేను. ప్చ్....వీలవలా! రాత్రి రాడా యింటికి"

—ఆరెస్‌డబులూ